# 'సాహితీ రుద్రమదేవి'
# ఊటుకూరు లక్ష్మీ కాంతమ్మ



నాళం కృష్ణారావుగారు సంఘసంస్కర్త. రాజమండ్రిలో కందుకూరి వీరేశలింగంగారి ప్రభావంతో సాంఘిక సేవా కార్య క్రమాల్లో పాల్గొని పంతులు గారి ఆంతరంగిక శిష్యుడయ్యారు. రాజమండ్రిలో గౌతమీ గ్రంథాలయం వ్యవస్థాపకులుగా కీర్తి గడించారు. రాయప్రోలు సుబ్బారావు గారిచే 'మధురకవి' బిరుదం పొందారు. వీరి అర్ధాంగి సుశీల గాంధీజీ ప్రభావంతో విదేశీ వస్త్ర దహనంలోను, ఖాదీ ఉద్యమంలోను పాల్గొన్న దేశ భక్తురాలు, కవయిత్రి.

ఈ పుణ్యదంపతుల గర్భశుక్తి ముక్తాఫలం లక్ష్మీకాంతమ్మగారు. 18- 12-1917లో మాతామహులు మోతే వారి ఇంట ఏలూరులో జన్మించారు. తండ్రి గారి సాహితీ వారసత్వాన్ని పుణికి పుచ్చుకున్న వీరు పదేళ్ల ప్రాయంలోనే వేదిక లెక్కి ఉపన్యాసాలు ఇచ్చేవారు. సాహిత్య రంగంలోకి అడుగుపెట్టిన తొలినాళ్లలో 'కృష్ణకుమారి' అనే పేరుతో భారతి మాస పత్రికకు రచనలు పంపేవారు. వ్యాసాలు, గేయాలు, పద్యాలు, చారిత్రక పరిశోధనలు, వచన కవితలు, ఖండ కావ్యాలు మొదలైన అన్ని సాహిత్య ప్రక్రియల్లోను వీరు రచనలు చేసారు. స్వాతంత్రోద్యమ కాలంలో వేలాది సభల్లో తన గంభీర కంఠంతో మహోపన్యాసాల ద్వారా జాతిని ఉత్తేజపరచిన విదుషీమణి. ఆమె ఆంధ్రదేశంలో మొట్ట మొదటి మహిళా గాన సభను స్థాపించారు. లక్ష్మీ కాంతమ్మ రచించిన 'ఆంధ్ర కవయిత్రులు', 'అఖిల 'భారత కవయిత్రులు' గ్రంథాలు ఆమె పరిశోధనా తత్పరతనుచాటి చెబుతూ ప్రామాణిక రచనలుగా ప్రసిద్ధి వహించాయి. ఇంకా ఆమె సామ్రాజ్య వైభవం' 'నా తెలుగు మాంచాల' 'దేవీ స్తవ తారావళి', 'మహిళా విక్రమ సూక్తం' 'కన్యకమ్మ నివాళి' వంటి వైవిధ్యభరితమైన రచనలు చేసారు.

'నా తెలుగు మాంచాల' వీరి రచనల్లో విలక్షణమైనది

'గుండె లోతులలో సుడి గుండమై సుళ్లు తిరిగే వీరరస స్ఫూర్తి, ఒక శుభ తరుణంలో తెలుగుల ఇంటి పడుచైన మాంచాల రూపమున పొడగట్టి వెన్నుతట్టినది' అంటారు ఈ రచనను గురించి రచయిత్రి. 'మన సాహితి - మధు భారతి' అనే వీరి కవితల సంపుటికి ముందుమాట రాస్తూ దాశరథి 'అభ్యుదయ భాను కిరణ కాంతులు' అన్నారు. 'లజ్జా కిరీట ధారిణి' అనే కావ్యం గురించి చెబుతూ రచయిత్రి "లజ్జా కిరీట ధారణియగు భారతపురంధి సౌశీల్యమై జగతికి రక్షయగునని విశ్వసించిన దాననగుటచే పరమ సాధ్వుల గురించి ప్రస్తావన మొనరించిన ఈ ఖండ కావ్యానికి 'లజ్జా కిరీట ధారిణి' అను నామమును ఉంచితిని." అన్నారు. ఇందులో మొల్ల ఆత్మనివేచనం, ఝాన్సీ లక్ష్మీబాయి మొదలైన గేయాలున్నాయి. లక్ష్మీకాంతమ్మ 1965లో అఖిల భారత రచయిత్రుల మహాసభను ఎంతో సమర్థవంతంగా నిర్వహించారు. 1975లో జరిగిన ప్రపంచ తెలుగు మహా సభల్లో నాటి ముఖ్యమంత్రి జలగం వెంగళరావుచే ఘన సన్మానం అందుకున్నారు. ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ వారి విశిష్ట సభ్యురాలిగా సువర్ణ పతకం అందుకున్నారు.

1953లో రాజమండ్రిలోని ఆంధ్ర వాఙ్మయసంఘం వారు 'విద్వత్కవయిత్రి' బిరుదు ఇచ్చి సత్కరించారు. 1953లో 'ఆంధ్ర కవయిత్రులు' గ్రంథ రచనకు తెలుగు భాషా సమితి ప్రథమ బహుమతి ప్రదానం చేసింది. 1953లో కేసరిగారిచే 'గృహలక్ష్మి స్వర్ణ కంకణ' అవార్డును పొందారు. 1963లో అప్పికట్ల సాహితీ సమాఖ్యవారు ఆమెకు గజారోహణ ఉత్సవం జరిపారు. 1975లో రష్యాలో జరిగిన తెలుగు మహాసభల్లో విశిష్ట కవయిత్రిగా ఘనసన్మానం పొందారు. 1971లో ఆంధ్ర విశ్వ విద్యాలయం 'కళాప్రపూర్ణ' బిరుదు ప్రదానం చేసింది. నాటి గవర్నర్ శ్రీమతి శారదా ముఖర్జీ నుండి ఈ బిరుదును స్వీకరించారు. 1990లో కెనడా, టొరొంటో నగరాలకు ఆహ్వానితురాలిగా వెళ్లారు. కేరళ, కర్నాటక, మహారాష్ట్రలలోని పలు సంస్థలసాహితీ పురస్కారాలు అందుకున్నారు. రష్యా, జర్మనీ, కెనడా, అమెరికా, స్పెయిన్, మలేషియా , జెక్ స్లవేకియా మొదలైన దేశాలు లసందర్శించి అక్కడి విశ్వ విద్యాలయాల్లో ఉపన్యసించారు.

లక్ష్మీ కాంతమ్మ జాతీయోద్యమంలోనూ పాల్గొని విదేశీ వస్త్ర బహిష్కరణ ఉద్యమంలో క్రియాశీలంగా భూమిక నిర్వహించారు. ఆమె ఎన్నో సాహిత్య సామాజిక సాంస్కృతిక సంస్థలు నిర్వహించారు. భావపురి సంగీతసభ, శ్రీహితైషిణి మండలి, కళాభారతి, మధుర కవి నాళం కృష్ణ రాయ విజ్ఞాన పీఠం వంటి సంస్థలకు అధ్యక్షులుగా బాధ్యతలు నిర్వహించారు. కేంద్ర సాహిత్య అకాడమీ సభ్యత్వాన్ని పొందారు.

నాయక రాజుల కాలంలో 17వ శతాబ్దంలో విజయ రాఘవ నాయకుని ఆస్థాన కవయిత్రి పసుపు లేటి రంగాజమ్మ తర్వాత కనకాభిషేకం పొందిన ఏకైక కవయిత్రి లక్ష్మీకాంతమ్మ. 1988లో కాసంసెట్టి శకుంతలమ్మ, రాధాకృష్ణయ్య ఫౌండేషన్ వారు ఈ కనకాభిషేకం నిర్వహించారు. ఆంధ్ర సరస్వతి, ఆంధ్ర విదుషీ కుమారి, ధర్మ ప్రచార భారతి, బ్రహ్మ భూషణ, సాహితీ రుద్రమ, కళాభారతి, సంగీత సాహిత్య కళానిధి, అపరవాగ్దేవి మొదలైన బిరుదులు ఆమెను వరించాయి.

పట్టుదల, సద్యఃస్ఫూర్తి, అహింసాతత్వం, అన్యాయంపట్ల అసహనం అమె స్వభావంలోని విశిష్టగుణాలు. లాల్ బహదూర్ శాస్త్రి ప్రధానిగా ఉన్నప్పుడు గుంటూరులో జరిగిన అఖిల భారత కాంగ్రెస్ మహా సభలకు హాజరైన మహిళా ప్రతినిధుల వసతి సౌకర్యాలు, భోజనం ఏర్పాట్ల బాధ్యత చాలా సమర్థంగా నిర్వహించారు. రైల్వేమంత్రి

మధు దండావతి ఆంధ్రలో పర్యటించినపుడు బాపట్లలో ఆగేటట్లు చెయడం ఆమె పట్టుదలకి మచ్చుతునక. హిందీప్రచారోద్యమం వల్ల తెలుగు భాషకు కొంతనష్టం జరుగుతోందని భావించి హిందీ ప్రచారాని కోసం వచ్చిన

కే కే కావేల్కర్ గారితో నిర్భయంగా వాదించి, హిందీ పాఠ్య ప్రణాళికల్లో తెలుగుపాఠ్యంశాలనూ చేర్పించారు. ఆకాశవాణి లో లలిత భక్తిగీతాలు ప్రారంభంకావడంలోను ఈమె గణనీయమైన పాత్ర నిర్వహించారు.

ఆంధ్రజీవరక్ష సంఘం కార్యదర్శి శ్రీకుశాల్జి అమరావతి తిరునాళ్లలో జరుగుతున్న జీవహింసను అపుచేయించాల్సిందిగా వీరిని కోరితే తను ఎనిమిది నెలలు గర్భవతియైన ఇంట్లో పెద్దల మందలింపుల్ని లెక్కచేయకుండా మూగజీవాల ప్రాణాలు రక్షించడానికి అమరావతి వెళ్ళి కార్యం సాధించారు. లక్ష్మీకాంతమ్మ గొప్పవ్యక్తి.

గుంటూరులో 'ఆదర్శవివాహం' అన్న అంశంపై రెండుగంటలపాటు అనర్గళంగా ప్రసంగించడం 1950లో ఆంధ్రవిశ్వవిద్యాలయంలో మహిళాభ్యుదయ ఉత్సవాల్లో 'ఆంధ్రభ్యుదయం మహిళలు' అనే విషయంపై చేసిన ఉపన్యాసం ఆమెను వక్తగా నిరూపించాయి. ఒంగోలులో ఆంధ్రా సాహిత్యంపై అమె చేసిన ప్రసంగం విశిష్టమైనదిగా, ప్రముఖ భాషా శాస్త్రజ్ఞులు భద్రిరాజు కృష్ణమూర్తిని ప్రభావితం చేసిందని ఆమె పేర్కొన్నారు.

లక్ష్మీ కాంతం భర్త హయగ్రీవగుప్త గారు న్యాయవాది.

వీరి ప్రథమపుత్రిక పోలేపల్లి సుహాసినిగారు అశువుగా పద్యాలు చెప్పగలరు. ఆకాశవాణిలో వీరి లలిత గీతాలు, కవితలు, ప్రసంగాలు అనేకం ప్రసారమయ్యాయి. లక్ష్మీ కాంతమ్మ గారి కుమారులు ప్రతాప చంద్ర కవి, కథకులు. బాల సాహిత్య, పర్యావరణ పరిరక్షణ రచనలు వీరి విశిష్టత.

ఊటుకూరు లక్ష్మీకాంతమ్మ గారు 1996లో సాహితీ ప్రియులను దుఃఖసాగరంలో ముంచుతూ ఈ లోకం నుంచి నిష్క్రమించారు.

- విషయ సేకరణ & కూర్పు :
సాహితీబంధువు :
డా. ఆళ్ళ నాగేశ్వరరావు (కమల శ్రీ)
తెనాలి, గుంటూరు జిల్లా
ఆంధ్రప్రదేశ్ రాష్ట్రము
చరవాణి :7416638823



# శీర్షిక : నా కోసం ఒక రోజు మిగిల్చుకోనివ్వండి.

నా కోసం ఒక రోజును మిగిల్చుకోనివ్వండి
సూర్యుడు నా పేరును కిరణాలతో రాసేలా చూడనివ్వండి
గాలి నా శ్వాసపై రాగం పాడనివ్వండి
ఆకాశం నా కన్నీటిని నక్షత్రాలుగా మార్చనివ్వండి
చెట్టు నా నీడను తన ఆలింగనంలో దాచుకోనివ్వండి
నది నా మాటలను తన ప్రవాహంలో తీసుకెళ్లనివ్వండి
ఒక్క రోజు నా హృదయం స్వేచ్ఛగా బతకనివ్వండి

ఆ రోజు తర్వాత నన్ను మరచిపోయినా పర్వాలేదు!
నా కోసం ఆ ఒక్క రోజును రాసుకో నివ్వండి
అది చాలుడ నా జీవితం పరిపూర్ణమవుతుంది
నా నవ్వును పూలలా ఈ నేలపై చల్లనివ్వండి
పక్షులు నా పేరును పలుకుతూ నీలాకాశంలో ఎగరనివ్వండి

నా ఆశలను రంగులుగా చిత్రీకరించనివ్వండి
చంద్రుడు నా కలలను తన వెన్నెలలో నింపనివ్వండి
నా ఉనికిని లోకానికి గుర్తుచేయనివ్వండి
ఆ రోజు ముగిశాక... సంతోషంగా వీడ్కోలు పలుకుతాను
నా శ్వాసను ఆఖరి గాలిలో వదిలేస్తాను
భూమి నా జ్ఞాపకాలను మట్టిలో కలిపేస్తుంది
అయినా ఒక్కసారి నా ప్రేమను మీరు గుర్తుచేసుకోండి
ఆ ఒక్క రోజు... నా ఆత్మ తృప్తిగా నిద్రపోతుంది!.



మీ రాము కోలా.దెందుకూరు
ఖమ్మం.9849001201.





# మండల అధ్యక్షుడు మాధవ్ ఆధ్వర్యంలో
# జనసేన కమిటీ సమావేశం

బుచ్చిరెడ్డిపాలెం

ఈరోజు మినగల్లు గ్రామంలో గ్రామ జనసేన కమిటీ సమావేశం, స్థానిక నాయుకులతో ఏర్పాటు చేయడం జరిగింది, ఈ సమావేశం లో గ్రామంలో జనసేన బలోపేతం చేసెందుకు రాబోయే పార్టీ సభ్యత్వ కార్యక్రమం లో మినగల్లులో గతంలో కంటే ఎక్కువగా సభ్యత్వాలు జరిగేలా చూడాలని అలాగే గ్రామం అభివృధి లో జనసేన పాత్ర ఉండాలని, పార్టీని ప్రజలకు మరింత చేరువయ్యేలా వుండాలని గ్రామంలోని సమస్యలను తెలుసుకుని వాటిని పరిష్కరించే విధంగా కార్యక్రమాలు ఏర్పాటు చేయాలని మండల అధ్యక్షులు మాధవ్ తెలిపారు, ఈ కార్యక్రమం లో స్థానిక జనసైనికులు, గోవర్ధన్,నాగరాజు,యశ్వంత్, వెంకయ్య,భార్గవ్ ,వెంకటేష్ , మండల జనసైనికులు పసుపులేటి సురేష్, తుమ్మల ప్రసాద్, బిట్రాసాయి, మనోజ్, పాల్గొన్నారు

# చెట్నహళ్లి గ్రామంలో సైబర్ నేరాలపై అవగాహన కల్పించిన మంత్రాలయం ఎస్ఐ. మల్లికార్జున

మంత్రాలయం:

మంత్రాలయం మండల పరిధిలోని చెట్నహళ్లి గ్రామంలో మంత్రాలయం సబ్ ఇన్‌స్పెక్టర్ (ఎస్ఐ) మల్లికార్జున . ఆధ్వర్యంలో సైబర్ నేరాల పట్ల అవగాహన సదస్సు నిర్వహించబడింది. పెరుగుతున్న టెక్నాలజీతో పాటుగా సైబర్ నేరగాళ్లు సామాన్య ప్రజలను మోసం చేస్తున్న తీరుపై గ్రామస్తులకు ఆయన వివరించారు.సదస్సులోని

అపరిచిత లింకులు: వాట్సాప్ లేదా ఎస్సెమ్మెస్ ద్వారా వచ్చే తెలియని లింకులను క్లిక్ చేయవద్దని, అలా చేయడం వల్ల ఫోన్ హ్యాక్ అయ్యే ప్రమాదం ఉందని హెచ్చరించారు.ఓటిపి (ఓటీపీ) జాగ్రత్తలు: బ్యాంకు అధికారులమని చెబుతూ ఎవరైనా ఫోన్ చేస్తే నమ్మవద్దని, మీ ఓటీపీ, పిన్ నంబర్ లేదా బ్యాంక్ వివరాలు ఎవరికీ చెప్పకూడదని సూచించారు.సైబర్ మోసాలు: తక్కువ ధరకే వస్తువులు ఇస్తామని, లాటరీ తగిలిందని వచ్చే నకిలీ కాల్స్ పట్ల అప్రమత్తంగా ఉండాలని కోరారు.వెంటనే ఫిర్యాదు చేయండి: ఒకవేళ సైబర్ మోసానికి గురైతే ఆలస్యం చేయకుండా 1930 అనే టోల్ ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేయాలని లేదా www.cybercrime.gov.in వెబ్‌సైట్‌లో ఫిర్యాదు చేయాలని తెలిపారు.ఈ సందర్భంగా ఎస్ఐ మల్లికార్జున మాట్లాడుతూ.. "ప్రజలు అప్రమత్తంగా ఉండటమే సైబర్ నేరాలకు ప్రధాన విరుగుడు. మోసపోయినట్లు గమనిస్తే మొదటి రెండు గంటల (Golden Hour) లోపు ఫిర్యాదు చేస్తే మీ డబ్బును తిరిగి పొందే అవకాశం ఎక్కువగా ఉంటుంది," అని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, యువకులు మరియు మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



